# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే ముందు స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**

**2.** **కులగణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు.**

**3.** **వరంగల్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాకారం చేశారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.**

**4.** **ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వైద్యులందరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కోరారు.**

**5.** **చార్టెడ్ అకౌంటెంట్లు సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచవ్యాప్త అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సూచించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే ముందు స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. తిరుపతిలో నిన్న నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని సూచించారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి 5 స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలు రావడం ఎంతో గర్వంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

.. వాయిస్.. 30 సెకన్లు

--------------------------

2027 డిసెంబరు నెలాఖరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఆయన నిన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఏడాది పాలన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. లోటు బడ్జెట్‌లోనే ప్రభుత్వం ఏడాదికి 36 వేల కోట్ల రూపాయలు సామాజిక పింఛన్ల మీదే ఖర్చు పెడుతోందని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని రామానాయుడు తెలిపారు.

--------------------------

కులగణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది కేవలం గణాంక సమాచారం కాదని, సామాజికంగా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య పరిస్థితిని తెలియజెప్పే మెగా హెల్త్ చెకప్ నివేదికగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలోని బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ నివేదిక ఉపయోగపడుతుందన్నారు. కులగణన నివేదికను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ 300 పేజీలతో కూడిన వివరణాత్మక నివేదికను నిన్న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రికి అందజేసింది.

---------------------------

వరంగల్ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాకారం చేశారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులుతో మాట్లాడుతూ.. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోందని.. పనులు వేగంగా సాగుతున్నాయని అన్నారు. వచ్చే సంవత్సరం ఇక్కడ రైల్వే కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందని కేంద్ర మంత్రి వెల్లడిస్తూ..

వాయిస్.. 28 సెకన్లు

---------------------------

ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో వైద్యులందరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్..ఏపీసీఎస్ఐ సదస్సును నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలల్లోనూ అధునాతన గుండెవైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేటు వైద్యులు 15 రోజులకోసారి ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయాలని మంత్రి కోరారు.

---------------------------

ప్లాస్టిక్ వినియోగంతో ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయనగరంలో నిన్న నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను హోం శాఖ మంత్రి సన్మానించారు. ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా డ్వాక్రా, మెప్మా సంఘాల ద్వారా పేపర్, జనపనార, కాటన్ సంచుల తయారీ యూనిట్లను స్థాపించేలా శిక్షణ ఇవ్వాలని అనిత సూచిస్తూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

మారుతున్న కాలానికి అనుగుణంగా చార్టెడ్ అకౌంటెంట్లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచవ్యాప్త అవగాహన, ఏఐ ఆధారిత నైపుణ్యాలు కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సూచించారు.

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా.. ఐసీఏఐ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన 'స్ఫూర్తి మెగా సీఏ విద్యార్థుల' సమావేశానికి ఆయన నిన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. సీఏలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదని.. ఆర్థిక వృద్ధి చోదకులు అని తెలిపారు. పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతీ ప్రభుత్వ ఫైల్‌కు ఆడిటర్ల ఆమోదముద్ర అవసరమని మంత్రి వివరించాచారు.

---------------------------

గ్రీన్ హైడ్రోజన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయాలని డిక్లరేషన్‌లో పొందుపరుస్తామని ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి కార్పొరేషన్.. నెడ్‌క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు వెల్లడించారు. అమరావతిలోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 నిన్నటితో ముగిసింది. రెండు రోజుల ఈ సమ్మిట్‌లో గ్రీన్ హైడ్రోజన్ తయారీ, వినియోగం వంటి పలు అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి తెలుపుతామని, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పరిశ్రమల స్థాపన వంటి అంశాలపై ఏడాదికోసారి సమీక్షిస్తామని కమలాకర్ బాబు ఆకాశవాణికి వివరిస్తూ...

వాయిస్ ..23 సెకన్లు

---------------------------

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఢిల్లీలో నిన్న సమావేశమయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఢిల్లీ వెళ్లిన ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ అధ్యక్షుడి ఆదేశాల మేరకు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మాధవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రెండు రోజులు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ రోజు అల్లూరి సీతారామ రాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

కాగా.. తెలంగాణలోనూ రానున్న రెండ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో ఐదురోజులపాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

=====================